## క్లుప్తంగా

### ప్రతి ఎకరాకు నీరు

**సంతకవిటి:** ఆయకట్టులోని ప్రతి ఎకరాకు నీరు అందించటమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఎస్ఈ సుధాకర్ అన్నారు. నారాయణపురం కుడి కాలువ ద్వారా గురువారం నీటిని విడుదల చేశారు. రైతులందరూ పూనులు అడ్డుకట్టలు వేయకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఈ ఎం.మురళీమోహన్, జేఈ పి.రవికుమార్, ఏఈ జీవీ రమణ, జేఈలు ఎస్.శ్రీనివాసరావు, కె.రాంబాబు, ఐజీలు తదితరులు పాల్గొన్నారు.

### పోడు పట్టాలివ్వాలి...

**బొబ్బిలి:** మండల పరిధిలోని గిరిజన గ్రామాల్లో పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏఓ ఎం. గణపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తాడంగి ఎండుదొర, శంకరరావు, సీతయ్య, జీరా, తదితరులు పాల్గొన్నారు.

### యోగాతో ఆరోగ్యం

**రాజాం:** యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం సాధ్యమని వికాస తరంగణి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీటీవీ రమణమూర్తి అన్నారు. నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఇలాంటి శిక్షణ చాలా అవసరమని వెల్లడించారు. ఎక్కడ యోగా తరగతులు జరిగినా ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. రాజాం పట్టణ పరిధిలో వికాస తరంగణి ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు పాఠశాల వద్ద ఈ నెల 10 నుంచి ప్రారంభమైన ఉచిత యోగా శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలతో మాట్లాడారు. ఈ యోగాలో భాగంగా నేర్పిన సూర్యనమస్కారాలు, ప్రాణాయామం వంటివి ఎంతో విలువైన ఆసనాలని వెల్లడించారు. కార్యక్రమంలో పాలకొండ ఎంఈవో డొంక త్రినాధులు, యోగా గురువులు గడే అప్పలనాయుడు, మురపాక గణేష్, వాకచర్ల వెంకటపైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి..

**బాడంగి:** మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సంక్షేమ వసతిగృహాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ బొబ్బిలి డివిజన్ కమిటీ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు సభ్యులతో కలిసి రెవెన్యూ సిబ్బందికి గురువారం వినతిపత్రం అందజేశారు. సిబ్బందిని నియమించాలని, పుస్తకాలు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, మెస్ చార్జీలు పెంచాలని, తదితర డిమాండ్లను వినతిపత్రంలో పొందుపరిచారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ కార్యదర్శి తేజ, సభ్యులు కృష్ణ, వినయ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### మద్దతు ధర పెంచాలి

**బొబ్బిలి:** కేంద్ర ప్రభుత్వం చెరుకు రైతులకు మద్దతు ధర పెంచాలని చెరకు రైతు సంఘ నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, సింగిరెడ్డి గోపాలం కోరారు. ఈ మేరకు పట్టణంలో ఉన్న చెరకు ఉప కమిషనర్ కార్యాలయంలో సహాయ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ, లచ్చయ్యపేట ఎన్సీఎస్ సుగర్స్ యాజమాన్యం బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్లే రైతులకు ఈ దుస్థితి దాపురించిందని చెప్పారు.

### ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

**రేగిడి :** పుట్టిన ప్రతి వ్యక్తికి సమాజానికి మంచి చేయాలన్న ఆలోచన తలంపు ఉంటే ఏదైనా సాధించవచ్చని హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు అన్నారు. గురువారం రేగిడి గ్రామంలో రూ. 60 లక్షలతో వేణుగోపాలనాయుడు నిర్మించిన విశ్వసాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపాదనలో కొంతభాగాన్ని దైవ కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా వేమకోటి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో రుత్విక్‌లు వేమకోటి ప్రసాద్‌శర్మ, అంపోలు రామ్ ప్రసాద్‌శర్మ, వేమకోటి జానకీరామ్ శర్మ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### జింక్ లోప నివారణకు చర్యలు

● ఏఓ శిరీష

**బాడంగి:** వరి నారుమడుల్లో జింక్‌లోప నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. శిరీష తెలిపారు. మండలంలోని రేజేరు, ఆనవరం గ్రామాల్లోని ఆర్‌బీకేలను గురువారం ఆమె సందర్శించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని వరి నారుమడులను పరిశీలించి, జింక్ లోప నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. లీటర్ నీటిలో రెండు గ్రాముల జింక్ చిలమిన్ అనే మందును బాగా కలిపి సరిపడా పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే ఆకు తీసే వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు జల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పుష్పలత, వీఏఏ సాయికుమార్, రైతులు పాల్గొన్నారు.

### వసతిగృహం ఆకస్మిక తనిఖీ

**వంగర:** మండల పరిధిలోని ఎం.సీతారాంపురం బీసీ బాలుర వసతిగృహాన్ని బొబ్బిలి బీసీ సంక్షేమ సహాయాధికారిణి ఎ.శ్యామలాకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. వసతిగృహంతో పాటు పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని వార్డెన్ సూర్యంకు సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

# ప్రజలకు అండగా జగనన్న సురక్ష..



రాజాం సిటీ: రాజాం పట్టణంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకు వెళ్లడంతో పాటు అర్హులకు సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కార్యక్రమంలో భాగంగా అవసరమైన వారికి 11 రకాల ధ్రువపత్రాలు అందజేస్తున్నారు. అలాగే అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. పాలకులు, అధికారులు ఇంటింటికీ వచ్చి సమస్యలు గుర్తించడంతో పాటు సేవలు అందిస్తుండడంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి, పలువురు లబ్ధిదారులకు పాలకులు, అధికారులు ధ్రువపత్రాలు అందజేశారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



సంతకవిటి: కాకరాపల్లిలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు



వంగర: మద్దువలసలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ



రాజాం : పెనుబాక గ్రామంలో జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బండి నర్సింహులు తదితరులు



రామభద్రపురం : సచివాలయం-3పరిధిలో రైతులకు కౌలు పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, తహసీల్దార్ రాజారావు



బాడంగి: అర్హులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ గౌరి, తదితరులు



బాడంగి: భీమవరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రఫీజాన్, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు



తెర్లాం: నందిగాంలో లబ్ధిదారునికి సర్టిఫికెట్లు అందజేస్తున్న బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ, పక్కన ఎంపీపీ ఉమాలక్ష్మి



బొబ్బిలి: మెట్టవలసలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు శాంతకుమారి, తదితరులు



మెంటాడ: ఇప్పలవలసలో అందుకున్న ధ్రువపత్రాలను చూపుతున్న లబ్ధిదారులు

## ప్రతీ గడపలో సీఎం సంక్షేమ సంతకం

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

**రాజాం :** ప్రతీ ఇంటిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల లబ్ధి కనిపిస్తుందని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని గడిముడిదాం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్ ప్రజలకు అందించి, వాటిలో పథకాలు నేరుగా లబ్ధిదారునికి వచ్చాయా...రాలేదా అని ప్రశ్నిస్తూ వివరాలు సేకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి సంక్షేమ ప్రభుత్వం గతంలో ఎప్పుడూ చూడలేదని వెల్లడించారు. ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ అర్హత మాత్రమే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ లావేటి సులోచన, వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, రాజాం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడు, ఎంపీటీసీ రాంబాబు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్‌కే రాజు, ఏపీఎం దదికుమార్, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



గడిముడిదాంలో లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యేజోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

## భూముల రీ సర్వే వేగవంతం

● బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ

**తెర్లాం:** మండలంలో జరుగుతున్న వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వేను సచివాలయ సర్వేయర్లంతా మరింత వేగవంతం చేయాలని బొబ్బిలి రెవిన్యూ డివిజనల్ అధికారి శేషశైలజ ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ డి.రత్నకుమార్ అధ్యక్షతన భూముల రీ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వే, డీఎల్ఆర్ తయారీ వంటి అంశాలపై రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రవికిరణ్, మండల సర్వేయర్ వెంకటరమణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ, నిర్ణీత గడువులోగా మండలంలో భూముల రీసర్వేను పూర్తి చేయాలన్నారు. అనంతరం మండలంలో ఓటర్ల చేర్పులు, తొలగింపులపై బీఎల్‌ఓలతో మాట్లాడారు.

## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

**రేగిడి :** విద్యార్థులు బాల్యం నుంచి మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక ఉంగరాడ మెట్ట వద్ద ఏపీ బాలయోగి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి మందులు అందించారు. ఆయుర్వేద వైద్యం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చునని తెలిపారు. శిబిరంలో వైస్ ప్రిన్సిపాల్ డి.సూర్యనారాయణ, పీఎస్ఎన్ మూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ టి.శ్రీనివాసరావు, యోగా ఇన్‌స్ట్రక్టర్ ఎం.రామకృష్ణ, స్టాఫ్‌నర్సు అంజలి, బంగారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యసేవలు అందించడం అభినందనీయం

**బొబ్బిలి:** పట్టణంలోని వెలమ కల్యాణ మంటపంలో కొప్పల వెలమ సంక్షేమ సంఘం, మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ, సంఘాల ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా సుమారు 250 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీపీ శంబంగి లక్ష్మి, మాజీ సైనిక సంఘ అధ్యక్షుడు రెడ్డి దామోదరరావు, గౌరవాధ్యక్షుడు మరడ అప్పారావు, డాక్టర్ రెడ్డి చైతన్య, వీఎస్ శర్మ, కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

## సంక్షిప్తంగా...

### బహుళ ప్రయోజనకారిగా రేషన్ మొబైల్ వ్యాన్

**రాజాం :** మండలంలో పలు గ్రామాలకు చెందిన రేషన్ సరుకుల పంపిణీ మొబైల్ వ్యానులను బహుళ ప్రయోజనాల నిమిత్తం వినియోగిస్తున్నట్లు రాజాం సీఎస్‌డీటీ చిరంజీవి వెల్లడించారు. గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి రేషన్ అందిస్తున్న ఈ వ్యాన్‌లను ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల సరఫరా నిమిత్తం వినియోగించామని వెల్లడించారు. ఐదు వ్యానులు ద్వారా 60 ప్రభుత్వ పాఠశాలలకు రాజాం ఎమ్ఆర్‌సీ కార్యాలయం నుంచి పుస్తకాల పంపిణీ జరిగిందని అన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రాజాం సిటీ:** స్థానిక పాలకొండ రోడ్డులో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామని ఏఈ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణంలో భాగంగా విద్యుత్ స్తంభాలు మార్పు చేయనున్నామని పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏర్పడనున్న అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

### విద్యకు ప్రభుత్వం పెద్దపీట

**వంగర:** రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండల పరిధి మద్దువలస డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల, ఎంపీయూపీ పాఠశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, భోజనాల్లో రాజీ పడొద్దని ప్రిన్సిపాల్ సూర్యకుమారికి సూచించారు. పాఠ్యపుస్తకాలు పంపిణీ, జగనన్న గోరుముద్ద అమలు, నాడు - నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బూరాడ వెంకటరావు, బొత్స ప్రవీణ్, బొక్కెల వెంకటప్పలనాయుడు, కాబోతుల శ్రీనివాసునాయుడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### డ్రగ్స్ నిర్మూలనపై ముమ్మర ప్రచారం

**రేగిడి :** డ్రగ్స్ నిర్మూలనపై రేగిడి పోలీసులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి మత్తు పదార్థాలు, డ్రగ్స్ వంటివి వాడ వద్దంటూ అవగాహన కల్పించే వాల్ పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత గంజాయి, కొకైన్, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ ఎవరైనా అమ్మినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా శిక్షర్హులవుతారని హెచ్చరించారు.

### లక్ష్య సాధనకు కృషి చేయాలి

**రాజాం సిటీ:** విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని విశాఖ కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్లు చెరువు ఆదినారాయణ శాస్త్రి, ఖండాపు ప్రసాదరావు అన్నారు. గురువారం స్థానిక బ్రాంచిలో విద్యలో ప్రతిభ కనబర్చిన ఖాతాదారుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు - 2023 పేరుతో స్కాలర్‌షిప్‌లు అందించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకే ప్రతి ఏడాది మాదిరిగా ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. చదువులో రాణించడంతో పాటు పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ ఆర్.తిరుమలరావు, స్థానిక బ్రాంచి మేనేజర్ జీఎల్‌వీ ప్రకాష్‌రావు, కనకమహాలక్ష్మి, రంప జగదీశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ బీమా సాయం అందజేత

**రేగిడి :** మండలంలోని పెద్దశిర్లాం గ్రామానికి చెందిన బెజ్జిపురపు ఆదినారాయణ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. అతని భార్య ఇందుకు గురువారం పంచాయతీ సర్పంచ్ లెంక రాంబాబు వైఎస్సార్ బీమా తక్షణ సాయం ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. మిగిలిన నగదు నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అవుతుందని అన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సుధీర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### గ్రామాల్లో స్వామిత్ర సర్వే

**రాజాం :** మండలంలోని గుయ్యన్నవలస పంచాయతీ రామానుజపేట, బొమ్మినాయుడువలస పంచాయతీ విజయరాంపురం గ్రామాల్లో గురువారం స్వామిత్ర సర్వే నిర్వహించారు. అంతకు ముందు గ్రామ సభ నిర్వహించి రీ సర్వే డీటీ వెంకటేష్ మాట్లాడారు. మండలంలో అన్ని గ్రామాల్లో గ్రామ కంఠాల సర్వే పూర్తి చేసి, ఆర్‌వోఆర్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. గృహ యజమానులకు గృహ స్థల హక్కు పత్రాలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు సమతం లక్ష్మి, వంజరాపు అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### నాశనమైన పంట పరిశీలన

**తెర్లాం:** మండలంలోని రంగప్పవలసలో ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంటను ఎం.ఆర్ అగ్రహారం గ్రామ సచివాలయం వ్యవసాయ సహాయకురాలు గీతామాధురి గురువారం పరిశీలించారు. ఎంతమంది రైతులకు సంబంధించిన మొక్కజొన్న పంట నాశనమైందో ఆరా తీవారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, సుమారు పది ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించామన్నారు.

### న్యాయ అవగాహన సదస్సు రేపు

**రాజాం సిటీ:** స్థానిక కోర్టుల సముదాయంలో ఈ నెల 22న న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించనున్నామని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో 2016 చట్టం ప్రకారం పోలీసు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, ఎన్‌జీవోల సమన్వయంతో విద్యార్థులకు, యాసిడ్ దాడుల బాధితులకు చట్టపరమైన సేవలపై అవగాహన కల్పించనున్నామని పేర్కొన్నారు.

# వాస్తవాలు తెలుసుకో.. లోకేశ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

● కలలో కూడా మీకు అధికారం రాదు
● ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

**బొబ్బిలి:** ఎవరో ఇచ్చిన చీటీలు తీసుకుని చదవడం కాదు..ఆ ఏరియాలోని పరిస్థితులు తెలుసుకుని మాట్లాడాలని టీడీపీ కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బొబ్బిలి నియోజకవర్గం తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన రంగప్పవలస ఉపాధ్యాయుడు కృష్ణ మాస్టార్‌ను హత్య చేస్తే ... టీడీపీ నాయకుడ్ని వైఎస్సార్‌సీపీ నాయకులు చంపేశారని అనడం సరికాదన్నారు. మేం అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం.. అనడం కాదని... అసలు మీరు అధికారంలోకి వచ్చినట్టు కలలు కూడా కనొద్దని హితవు పలికారు. హత్యకు గురైన ఉపాధ్యాయుడు 30 ఏళ్లుగా తనకు ఎంతో నమ్మకస్తుడిగా ఉండేవాడని స్పష్టం చేశారు. అటువంటి వ్యక్తి హత్యపై శవరాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. అమ్మఒడి, రైతుభరోసా పథకాలతో ప్రజలు సంతోషంగా ఉంటే.. వాటిని పనికిమాలిన పథకాలు అనడం నీ చిన్న బుద్ధికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో నువ్వు, నీ తండ్రి గెలవడమే కష్టమన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ పట్టణ, మండల ఇన్‌చార్జ్‌లు రేజేటి ఈశ్వరరావు(విసు), తమ్మిరెడ్డి దామోధరరావు, తదితరులున్నారు.

**ఎంపీకి కృతజ్ఞతలు ..**

బొబ్బిలి మీదుగా దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు బొబ్బిలిలో హాల్ట్, స్టాపులను ఏర్పాటు చేసేందుకు సహకరించిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే శంబంగి కృతజ్ఞతలు తెలియజేశారు. యశ్వంత్‌పూర్-హతియా, యశ్వంత్‌పూర్-టాటానగర్, హతియా - ఎర్నాకులం రైళ్లు బొబ్బిలిలో ఆగడం వల్ల 12 మండలాల ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుందని చెప్పారు.

# పర్యవేక్షణ లోపంతోనే 'చెత్త' సమస్య

● రామభద్రపురం మేజర్ పంచాయతీ ఈఓ పనితీరుపై అసంతృప్తి
● సాక్షి కథనంతో దిగివచ్చిన అధికార యంత్రాంగం
● పారిశుధ్య కార్మికుల సమ్మెపై అటు పంచాయతీ పాలకవర్గం, ఇటు కార్మికులతో చర్చించిన డీఎల్‌పీఓ
● సమస్యలు పరిష్కారం కాక చర్చలు విఫలం



పంచాయతీ పాలకవర్గంతో చర్చలు జరుపుతున్న డీఎల్‌పీఓ మోహనరావు

**రామభద్రపురం:** మేజర్ పంచాయతీ ఈఓ పర్యవేక్షణ లోపంతోనే చెత్త సమస్య ఏర్పడిందని డీఎల్‌పీఓ మోహనరావు అన్నారు. కనీస వేతనాలు చెల్లించాలని ఈ నెల ఒకటో తేదీ నుంచి పారిశుధ్య కార్మికులు సమ్మె చేపట్టడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పారిశుధ్య పనులు జరగక.. గ్రామం కంపుగొడుతోంది. దీంతో రామభద్రపురంలో చెత్త సమస్య అన్న శీర్షికన ఈ నెల 19న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. డీపీఓ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ మోహనరావు, ఈఓపీఆర్‌డీ వెంకటరమణ, తదితరులు గురువారం రామభద్రపురం వచ్చి సర్పంచ్ ఈశ్వరావు, ఉప సర్పంచ్ చింతల రామకృష్ణలతో పాటు పారిశుధ్య కార్మికులతో చర్చలు జరిపారు. పంచాయతీలో 14 మంది పారిశుధ్య కార్మికులుండగా... ఏడుగురికి రూ. 8,200, మరో ఏడుగురికి 5,700 రూపాయల చొప్పున వేతనం ఇస్తున్నారు. అయితే అందరికీ సమానంగా నెలకు పది వేల రూపాయల వేతనం ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు డీఎల్‌పీఓ చేపట్టిన చర్చల్లో రూ.8,200 వేతనం అందుకుంటున్న కార్మికులకు తొమ్మిది వేల రూపాయలు.. 5,700 రూపాయల వేతనం అందుకుంటున్న వారికి ఏడు వేల రూపాయలు ఇవ్వడానికి పాలకవర్గం అంగీకరించింది. అయితే కార్మికులు మాత్రం అందరికీ సమానంగా రూ. 10 వేలు ఇవ్వాలని పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి. చర్చలు అనంతరం డీఎల్‌పీఓ విలేకరులతో మాట్లాడుతూ, కార్మికుల సమస్యలను డీపీఓ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు వారానికి రెండు లేదా మూడు రోజులకోసారి పారిశుధ్య పనులు పర్యవేక్షించాల్సి ఉండగా.. స్థానిక పంచాయతీ కార్యదర్శి ఆ విధంగా వ్యవహరించడం లేదన్నారు. ఒకటి, రెండు రోజుల్లో పారిశుధ్య సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఈఓ రవి ఉన్నారు.

# పీఎంఈజీపీ రుణాలతో ఆర్థిక చేయూత

**రాజాం :** పీఎంఈజీపీ రుణాలతో కుటీర పరిశ్రమలు, షాపులు నిర్వహించుకుంటే ఆర్థిక చేయూత ప్రతీ ఒక్కరికి లభిస్తుందని వైఎస్ఆర్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి అన్నారు. రాజాంలో ఏపీజీవీబీ బ్రాంచి వద్ద రాజాం మండలానికి చెందిన వీఓఏలు, బ్యాంకు మిత్రలతో సీబీఆర్ఎమ్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పీఎంఈజీపీ రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ రుణాల్లో 30 శాతం రాయితీ ఉండడంతో పాటు సకాలంలో రుణాలు మంజూరీ చేస్తున్నామని తెలిపారు. వీటిని తీసుకున్న లబ్ధిదారులు సకాలంలో చెల్లింపులు జరిపితే వడ్డీలు కూడా పెద్దగా ఉండవని వివరించారు. అనంతరం బ్యాంకు అధికారులు పీఎం ఎఫ్ఎమ్ఈ రుణాలు మంజూరీ, లింకేజీ, విల్లింగ్ తదితర విషయాలుపై మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం దధికుమారి, సీసీలు, సీఏఫ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

## గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలి : సీఐ

**రాజాం సిటీ:** రానున్న ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి నుంచే గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్త పడాలని, ప్రశాంత వాతావరణానికి అంతా సహకరించాలని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర కోరారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో సిబ్బందితో గురువరాం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కేటాయించిన దత్తత గ్రామాల పరిస్థితిని ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని అన్నారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు సమాచారం సేకరించాలని తెలిపారు. కార్యక్రమంలో రేగిడి ఎస్ఐ ఇ.శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యను పరిష్కరించుకోండి..

**మెంటాడ:** మండలంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌కు, ఉపాధ్యాయులకు మధ్య నెలకొన్న సమస్యను పరిష్కరించుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని డీఈఓ బి. లింగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని పెదమేడపల్లి ఆదర్శ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో వేర్వేరుగా మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాఠశాల ప్రతిష్ఠ దెబ్బతీసేవిధంగా ఎవ్వరూ ప్రవర్తించవద్దన్నారు. విద్యార్థుల హాజరుతో పాటు ఉపాధ్యాయుల బోధనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలనలో పాఠశాల ప్రిన్సిపాల్ సుమంత్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆదర్శ పాఠశాల సిబ్బందితో సమావేశమైన డీఈఓ లింగేశ్వరరెడ్డి

## మండల సమావేశం వాయిదా

**బొబ్బిలి:** ఈ నెల 21న ఉదయం 11 గంటలకు జరుగాల్సిన మండల సర్వసభ్య సమావేశం శనివారానికి వాయిదా పడిందని ఎంపీడీఓ పోతుల రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు అధ్యక్షతన జరగనున్న సర్వసభ్య సమావేశానికి అధికారులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.